డ్రై డే పాటిస్తే దోమలకు చెక్



జేవీ అగ్రహారంలో మాట్లాడుతున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము



లొడగలవానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, అధికారులు

ఆనందపురం : ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తే దోమలకు చెక్ పెట్టవచ్చని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ అన్నారు. ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని లొడగలవానిపాలెంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ నిల్వ ఉన్న మంచినీటిలో అనాఫిలిస్ దోమలు పెరుగుతాయని, ఆ దోమలు కుడితే డెంగ్యూ వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందన్నారు. టైర్లు, కొబ్బరి బొండాలు, రుబ్బు రోళ్లు, ఖాళీ పాత్రలు, ఎయిర్ కూలర్లు, మనీ ప్లాంట్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు మూతపెట్టి, ఎబెట్ ద్రావణాన్ని కలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, డాక్టర్ షెహనాజ్, ఈవోపీఆర్డీ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, ఐ.గోవిందరావు, సన్యాసిరావు, కల్యాణమ్మ, భావని, స్వరాజ్యం పాల్గొన్నారు.

ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

కొమ్మాది: ప్రజలకు ప్రాణాంతకంగా మారిన డెంగ్యూ వ్యాధి నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని భీమిలి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలేందుకు కారణాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించడానికి అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా నివాసాల మధ్య నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, మలేరియా నియంత్రణ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు బడే అమ్మోరు, పైడిరాజు, హేమ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


రోడ్ల పక్కన దుకాణాల తొలగింపు అడ్డగింత



సచివాలయ సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్న చిరు వ్యాపారులు

మధురవాడ: స్థానిక రైతుబజార్ రోడ్డులో దుకాణాల తొలగింపునకు సచివాలయ సిబ్బంది యత్నించగా వ్యాపారులు అడ్డుతగిలారు. రైతు బజార్ రోడ్డులో చిన్నపాటి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న దుకాణాల వల్ల నిత్యం రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయని ఎస్టేట్ ఆఫీసర్, పలువురు రైతులు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వాటిని నియంత్రించడానికి మంగళవారం సచివాలయ సిబ్బంది ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దుకాణాలు తొలగించేందుకు సిబ్బంది ప్రయత్నించగా చిరువ్యాపారులు వాగ్వివాదానికి దిగారు. దీంతో చేసేది లేక సిబ్బంది వెనుదిరిగారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా సచివాలయ సిబ్బందిని పంపించి నామమాత్ర ప్రయత్నం చేశారు. దీనిపై జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి స్పందించారు. రోడ్లపై చిరు వ్యాపారులు అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న దుకాణాల వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై చర్యలు చేపడతామన్నారు. దుకాణాల తొలగింపునకు అంతా సహకరించాలని కోరారు.

ముగిసిన అమ్మవార్ల జాతర మహోత్సవాలు



పూజలు అందుకున్న శ్రీ పోలమాంబ అమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఏటా ఘనంగా నిర్వహించే గ్రామ దేవతలు శ్రీ పోలమాంబ, శ్రీ ఎర్నిమాంబ, శ్రీ సత్తమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ మహోత్సవాలు మంగళవారం పోలమాంబ అనుపుతో ముగిశాయి. ఈ సందర్భంగా గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, చినరుషికొండ, పెద్ద రుషికొండ, ఎండాడ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనార్దనరావుకు సత్కారం



జనార్దనరావును సత్కరిస్తున్న నాయకులు

భీమునిపట్నం: భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ అడ్వకేట్ ఎస్.జనార్దనరావును వైఎస్సార్‌సీపీ నాయకుడు జీరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం వద్ద పూలమాల వేసి అభినందించారు. నాయకులు చిల్ల గణేష్‌రెడ్డి, జీరు భరత్‌రెడ్డి, చిల్ల త్రినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మధురవాడలో మజ్జిగ పంపిణీ చేస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

మధురవాడ: ఎండలు మండిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బాటసారులు, వాహనదారులకు మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు చల్లని మజ్జిగ, తాగునీరు మంగళవారం అందించారు. మధురవాడ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సంఘ నాయకురాలు ఆశాజ్యోతి తల్లి నూకాలమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేసినట్టు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఆశాజ్యోతి, జగన్మోహనరావు, ఆశా స్వరూప్, చిట్టిబాబు, ప్రసన్న కుమారి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



దారయ్య

ఆనందపురం : మండలంలోని కోలవాని పాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యంకాగా కుటుంబీకుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గండ్రెడ్డి దారయ్య(26) పెందుర్తి మండలం గొరపల్లిలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరి గొరపల్లి వెళ్లాడు. అక్కడ విధులు ముగించుకుని ఇంటికి వెళ్తానని యజమానికి చెప్పి బయలుదేరాడు. అలా బయలుదేరిన దారయ్య రాత్రికి ఇంటికి చేరలేదు. దీంతో అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని సోదరుడు గౌరీసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ సత్యానారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాల్లో వేలాడుతున్న లైట్లు



కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం నుంచి సాగర్‌నగర్ మార్గ మధ్యలో సెంట్రల్ లైటింగ్‌లో లైట్లు పలుచోట్ల గాల్లో వేలాడుతున్నాయి. ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లైట్లు సరిచేయించాలని కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ కరగానిపేటలో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా సీహెచ్.రాములప్పడుకు చెందిన కమ్మలపాక దగ్ధమయింది. ఈ ప్రమాదంలో దుస్తులు, వ్యవసాయ పనిముట్లు కాలిపోయాయి. ప్రమాద నష్టం రూ.70 వేల వరకు ఉంటుంది. చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

అంబరాన్నంటిన సిరిమాను సంబరం



ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం ప్రదర్శన

వైభవంగా పైడితల్లమ్మ ఉత్సవాలు



కృష్ణాపురంలో సిరిమానుపై పూజారి

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో పైడితల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. రామాలయం సమీపంలో పైల గురునాయుడు ఇంటిపై నుంచి పూజారి సుంకర గురునాయుడు సిరిమాను రథం అధిష్టించారు. విశేష పూజల అనంతరం రామాలయం నుంచి రాత్రి 7.20 గంటలకు సిరిమాను ఒక్కసారిగా నింగిలోకి లేచి ముందుకు కదిలింది. గ్రామ ప్రవేశం నుంచి చివర వరకు మూడు సార్లు తిరిగింది. సిరిమాను వెనుక అంజలి రథం, సురాల, సుంకర, మువ్వ వారి రథాలు సాగాయి. జై పైడితల్లమ్మ నినాదాల మధ్య సిరిమాను ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 2012లో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. మళ్లీ 11 ఏళ్లకు ఉత్సవాలు నిర్వహించడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఊరంతా జనసంద్రంగా మారింది. ఇసుక వేస్తే రాలనంతగా వచ్చిన భక్తులు సిరిమాను ఉత్సవాన్ని కనులారా వీక్షించారు. వీధులన్నీ జనంతో కిక్కిరిశాయి. మేడలపై నుంచి భక్తులు సిరిమాను ఉత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పులివేషాలు, చిడతలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ మందుగుండు సామగ్రి కాల్చారు. వైఎస్సార్‌సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు తదితరులు పైడితల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా బబ్బేలమ్మ ఊరేగింపు



బబ్బేలమ్మను ఊరేగిస్తున్న భక్తులు

పీఎం పాలెం: స్థానిక భక్తుల కొంగుబంగారంగా నిత్య పూజలు అందుకుంటున్న బబ్బేలమ్మ అమ్మవారి నెల రోజుల పండగలో భాగంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఊరేగింపుతో పాత పీఎం పాలెం, పిలకవానిపాలెం ప్రాంతాలు డప్పుల మోత, తప్పెటగుళ్ల సవ్వడులతో దద్దరిల్లిపోయాయి. ముందుగా అమ్మవారి మూల గద్దె నుంచి ప్రారంభమైన ఊరేగింపులో మహిళల చెక్క భజన, బాలికల కోలాటం, పులివేషాలు, తప్పెట గుళ్ల, డప్పు వాయిద్యాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. స్థానిక యువకులు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎండ, మబ్బులతో విచిత్ర వాతావరణం



మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన రోడ్డు

తగరపువలస: భీమిలి పరిధిలో మంగళవారం విచిత్ర వాతావరణ పరిస్థితులు కనిపించాయి. వేకువజామున మొదలైన పొగమంచు ఉదయం 8 గంటల వరకు పరిసరాలను కమ్మేసింది. తర్వాత మొదలైన ఎండ సాయంత్రం 4 గంటల వరకు తారెత్తించింది. మధ్యాహ్న సమయంలో విజయనగరంలో భారీ వర్షం కురవడంతో భీమిలి శివారు గ్రామాల్లో చల్లటి గాలులు వీచాయి. తర్వాత సాయంత్రం ఆకస్మాత్తుగా ఎండ మాయమై ఆకాశానికి మబ్బులు గొడుగు పట్టి వాతావరణం చల్లబడింది. తిరిగి రాత్రి నుంచి ఉక్కపోత ప్రారంభమైంది.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

18న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని వినతి



పట్టాలు చూపిస్తున్న లబ్ధిదారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు గంగడపాలెంలో సర్వే నంబరు 276/5, 277/1లో స్థానికులు 250 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు గతంలో అందజేశారు. అయితే ఆ స్థలం తనదంటూ ఓ ఆర్మీ ఉద్యోగి (రిటైర్డ్) కోర్టులో కేసు వేశారు. ఈ నేపథ్యంలో అక్కడ నిర్మాణాలు చేసుకోలేక, ఖాళీ స్థలాలు ఉంచుకోలేక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు మంగళవారం కె.నగరపాలెం సచివాలయంలో అధికారులను కలిసి తమ సమస్య విన్నవించుకున్నారు. తమకు మంజూరు చేసిన స్థలం విషయం కోర్టులో ఉన్నందున ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికే తహసీల్దార్ వేణుగోపాల్, స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబును కలిశామని, తమకు న్యాయం చేయమని లబ్ధిదారులు కోరారు. తమకు సమీపంలో స్థలం ఎక్కడ ఇచ్చినా పర్వాలేదని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- నేరాల నియంత్రణలో తోడ్పాటు అందించాలి
- సమావేశంలో సీపీ త్రివిక్రమ్‌వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి : ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్, ఏడీసీపీ (ట్రాఫిక్) అరీఫుల్లాతో కలిసి నగర ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అలాగే స్థానిక పోలీసులతో పూర్తి సమన్వయంతో నేరాల నియంత్రణ విషయంలో తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ-1 ఎం.జాన్‌మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ-2 రాజీవ్‌కుమార్‌తో పాటు వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఏయూ విద్యార్థుల ఔదార్యం

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతికి రూ.లక్ష సాయం



చికిత్స పొందుతున్న యువతితో మాట్లాడుతున్న ఆచార్య హరనాథ్

ఏయూ క్యాంపస్ : ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వర్సిటీ పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పందిరి అనూరాధ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె సుదీర్ఘ కాలం చికిత్స అందించాల్సిన అవసరం ఉంది. పేద కుటుంబానికి చెందిన అనూరాధ చికిత్సకు అధికంగా ఖర్చవుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు జి.ధర్మారావు, వై.గోపీచంద్‌లు తమ స్నేహితులు, బంధువుల నుంచి విరాళాలు సేకరించారు. ముందుగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనూరాధను సోషల్ వర్క్ విభాగాధిపతి ఎస్.హరనాథ్ స్వయంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు ఉపయుక్తంగా విద్యార్థులు సేకరించిన రూ 1,011,11ని బాధితురాలి తండ్రి రాముకు అందజేశారు. భవిష్యత్తులో సైతం అవసరమైన సహాయం అందిస్తామని చెప్పారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీయట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటర్ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఈ నెల 22 వరకూ నిర్వహించే తరగతులకు హాజరయ్యే విద్యార్థులందరికీ లయన్స్ క్లబ్ సహకారంతో భోజనం అందిస్తామని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు సన్యాసినాయుడు, ఆర్.పి.నాయుడు, విమల, పుష్పలత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ముందుకు కదలని మురుగు



కాలువల్లో నుంచి తొలగించిన మట్టి



కాలువలో నిలిచిపోయిన నాచుపట్టిన మురుగునీరు

- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రధాన కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు వెళ్లకుండా చాలా కాలంగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి తగరపువలస రోడ్డులోని వుడా మైదానం ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా రెండు పెద్ద కాలువలు ఉన్నాయి. చుట్టుపక్కల నివాసుల వాడుకనీరు ఈ కాలువల ద్వారానే సముద్రంలో కలుస్తుంది. వర్షాలు కురిసే సమయాల్లో కొన్ని గెడ్డల ద్వారా నీరు కూడా ఈ కాలువలో కలుస్తుంటుంది. ఇంతటి కీలకమైన కాలువలు కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడ ప్రైవేటు లే అవుట్‌లతో పాటు, నిర్మాణాల వల్ల మూసుకుపోయాయి. అప్పటి నుంచి నీరు ముందుకు వెళ్లకుండా కాలువల్లో నిలిచిపోతోంది. మట్టి, పూడిక, చెత్త పేరుకుపోవడంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఈ కాలువలు చెరువులను తలపిస్తున్నాయి.

నెలల తరబడి కాలువల్లో నీరు నిలిచిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువలను ఆనుకుని అంబేడ్కర్ కాలనీతోపాటు, మరికొందరి పేదల నివాసాలు ఉండగా వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. దోమలు కూడా విపరీతంగా పెరిగిపోవడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. ఇక భారీ వర్షాలు కురిసే సమయాల్లో కాలువల్లోని నీరు మొత్తం రోడ్లపైకి రావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండడంతోపాటు నివాసాల్లోకి నీరు చేరిపోతోంది.

అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఈ కాలువలపై దృష్టి సారించి పేరుకుపోయిన మట్టి తొలగింపజేశారు. అయితే పూర్తిస్థాయిలో మురుగు ప్రవాహానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



ఇక్కడి కాలువల్లో మురుగు నీరు నిలిచిపోవడంతో పరిస్థితి చాలా అధ్వానంగా తయారయింది. కాలువల పక్కనే మా నివాసాలు ఉండడంతో తీవ్రమైన దుర్వాసన భరించలేకపోతున్నాం. దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో రోగాల బారిన పడుతున్నాం.

– కోరాడ కృష్ణవేణి, స్థానికురాలు

సమస్య పరిష్కరించాలి



ప్రస్తుత జోనల్ కమిషనర్ స్పందించి కాలువల్లో మట్టిని తొలగించేందుకు చర్యలు చేపట్టడం సంతోషకరం. అయితే కాలువల్లోని నీరు ఎక్కడా నిలిచిపోకుండా నేరుగా సముద్రంలోకి కలిసేలా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలి. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కరించాలి.

– భాగం లక్ష్మి, స్థానికురాలు

త్వరలో పూర్తిస్థాయి చర్యలు



ఇక్కడ చాలా కాలంగా ఉన్న మురుగునీటి సమస్య పరిష్కారానికి త్వరలో పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాం. అందులో భాగంగానే ఇప్పుడు కాలువల్లోని పూడికలు తొలగించాం. తదుపరి పూర్తిస్థాయిలో మురుగునీరు సముద్రంలో కలిసేలా చర్యలు చేపడతాం.

– బొడ్డేపల్లి రాము, జోనల్ కమిషనర్

చలివేంద్రం ప్రారంభం



రేవిడిలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం

పద్మనాభం: మండలంలోని రేవిడి జంక్షన్‌లో శ్రీ శ్రీనివాస రేవిడి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. గొట్టిపల్లి బీఎస్ఎన్ డెయిరీ సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. వేసవి కాలం ముగిసేంత వరకు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ, ఎంపీటీసీ సభ్యుడు సీర సూపర్నడు, సంఘ అధ్యక్షుడు పి.ఇంద్రరావు, ఉపాధ్యక్షుడు మరగడ శ్రీనివాసరావు, రెడ్డి శ్రీను, మరగడ వెంకటేష్, రిటైర్డు ఎంపీడీవో బాపిరాజు పాల్గొన్నారు.